# లవ్ లెటర్

ఎ. సాయిగిరిధర్



"పోస్ట్, పోస్ట్" అని అరుస్తూ బయటకు పరుగెత్తి, ఇన్‌లాండ్ లెటరు తెచ్చింది పదో తరగతి చదువుతున్న పదిహేనేళ్ళ సరిత.

రాధమ్మ "ఎవరికే? ఎక్కడి నుంచే" అని వంటింట్లోనుంచే దీర్ఘంతీసింది సరిత వంటింట్లోకి దారితీసింది

"అక్కకే. విజయవాడనుంచి వచ్చింది" "ఎవరు రాశారే?" "ఎవరోనే. పి. హెచ్. పద్మనాభరావంట" రాధమ్మలో అలజడి, కంగారు బయలుదేరాయి. "నీ మొఖం సరిగ్గా చదివేదన్వే. ఎవరికా ఉత్తరం?" "చెబుతుంటే వినవేం? అక్క పేరు నాన్న పేరు ఊరు పేరు చివరికి పిన్‌కోడ్ కూడా సరిగానే ఉన్నాయే" రాధమ్మ ముఖంలో రంగులు మారాయి. కోపంతో ముఖం జేవురించింది. "లెటర్ చించి చదవ్వే. ఏముందో" "అమ్మో ఇంకేమన్నా వుందా అక్క చంపేస్తుంది!" "ఏడ్చావులే చదువు. చదవకపోతే ఇప్పుడే నిన్ను చంపేస్తా- అక్కడ కొంపలంటుకుపోతుంటే మధ్యలో నీగొడవ ఏంటి? మర్యాదగా చదువు." మనసులో లెటర్‌లో ఏముందో తెలుసుకోవాలనుకొన్న సరితకు చక్కని ఛాన్స్ చిక్కింది లెటర్ చించి చదవటం మొదలుపెట్టింది.

డియర్ సరూ!

నామీద నీకెందుకంత కోపం? ఎంత కోపమైనా మరీ అంత కోపమా? కనీసం ఒక ఉత్తరం ముక్క కూడా వ్రాయలేదు నెల నుంచి నీవులేకపోతే నేనెలా బ్రతకగలను? నీ వియోగం నేనెలా సహించగలను? నేను చేసిన చిన్న తప్పుకు ఇంత పెద్దశిక్ష విధిస్తావా? నాకు చెప్పా పెట్టకుండా నన్నొదిలేసి వస్తావా? అప్పుడే మనిద్దరి మధ్యా ఉన్న స్నేహానుబంధం, ప్రేమ, అనురాగం, ఆప్యాయత అన్నీ మరిచావా?

మన జీవితంలో మరపురాని "పెళ్ళిరోజు"ను మరిచిపోయావా? ఆరోజు మనమేమని బాసలు చేసుకొన్నాం? కలకాలం చిలకాగోరింకల్లా కలసిఉండాలని ఎన్నెన్నో ప్రమాణాలు చేసుకొన్నాం. అవన్నీ మరిచావా?

ఇంకా మన జీవితంలో ఎన్నో మరువలేని మరపురాని సంఘటనలు.... అవన్నీ నా మనసులో చెరగని ముద్ర వేశాయి. తలచుకుంటే బాధిస్తున్నాయి. అవన్నీ తేలికగా మర్చిపోగలవా?

ఇప్పుడు కూడా క్షమాపణఅడుగుతున్నా. ప్లీజ్ నన్ను క్షమించవూ! ఇంకెప్పుడూ "చారు"తో మాట్లాడనుగా. నన్ను క్షమిస్తావు కదూ?

నీ లెటర్ కోసం వేయి కళ్ళతో ఎదురు చూసే

నీ

పద్మనాభరావు

ఇక వంటింట్లో వుండలేక హాల్లోకి వచ్చి కుర్చీలో చేరగిలబడింది రాధమ్మ. దీనికి తోడు ఉదయాన్నే కోర్టు పనిపై విజయవాడ వెళ్ళిన శ్రీవారు మధ్యాహ్నమౌతున్నా తిరిగి రాకపోవడంతో ఆమె ఆందోళన తారాస్థాయికి చేరుకుంది. ఇటు కూతురు జీవితం, అటు భర్త పరువు ప్రతిష్ఠలు.

అప్పుడే వచ్చిన రాఘవయ్యగారికి రాధమ్మనాస్థితిలో చూసేసరికి మనసులో ఏదో కలవరం బయలుదేరింది. ఆయన్ను చూసిందో లేదో, ఆమెలో గూడుకట్టుకున్న దుఃఖం ఒక్కసారే పెల్లుబికింది. "నేను చెబితే వినరు. ఇక్కడ చదివిన చదువులు చాల్లే అంటే వినకుండా ఏంటో పెద్ద కలెక్టరౌతున్నట్లు విజయవాడలో నెలకు ఐదొందలు తగలేసి చదివిస్తున్నారు. చివరకు అదేం చేసిందో చూశారా ఎవడినో పెళ్ళి చేసుకొని. పైగా వాడినొదిలేసొచ్చిందండి" అని లెటర్ ఆయనకిచ్చింది.

రాఘవయ్యగారికి ఇద్దరూ ఆడపిల్లలే- సరోజ, సరిత. సరోజ ముద్దుల కూతురు. ఆమె అంటే ఆయనకు ఆరో ప్రాణం. తన కూతురిలా చేసిందంటే ఆయనకేమి చేయాలో తోచలేదు. పెళ్ళి చేసుకొంటే చేసుకుంది. వాడిని వదిలేసి రావడమెందుకు? వాడి కులగోత్రాలేంటో? ఇక పరువేమౌతుందో? ఈ విధంగా సాగిపోతున్నాయి ఆయన ఆలోచనలు. ఇంతకీ ఎవరూ భోజనాలు చేయలేదు. ఎవరి రూమ్‌లో వారు ఆలోచనలతో సతమతమౌతున్నారు. సరితకు ఈ వాతావరణం చాలా బాధకలిగించింది. అక్కపై పెద్దకోపమొచ్చింది

అంతలో సరితను పెద్దగా పిలచి రాఘవయ్యగారు "దాని టేబుల్‌పై పడెయ్" అని కోపంగా లెటర్ విసిరేశారు. దానిని తీసుకెళ్ళి యథావిధిగా అతికించి, టేబుల్‌పై చక్కగా కనబడేటట్లు పెట్టింది.

సాయంకాలమైంది. స్నేహితురాలింటికెళ్ళిన సరోజ తిరిగి వచ్చింది. ఇంట్లో మౌనవ్రతాలు ఆమెకేమీ అర్థం కాలేదు. ఒక వేళ కోర్టులో ఓడిపోయారేమో అని అనుకొని మెల్లిగా తన రూం కెళ్ళింది. లెటర్ చూచి, చించి చదివింది. వెంటనే రిప్లయి వ్రాయడం మొదలుపెట్టింది.

డియర్ పద్మనాభ్!

నీ లెటర్ అందింది. నీబాధ అర్థమైంది! నీకేకాదు. నాకుమాత్రం బాధగా ఉండదూ. మరి ఆరోజు శారద ప్రక్కనే కూర్చొని దానితో ఎందుకు మాట్లాడావు? నీకెన్ని సార్లు చెప్పాను. దానితో మాట్లాడవద్దని. అట్లాంటి కొంపలుకూల్చేవాళ్ళతో మాట్లాడవద్దని నీకెన్నిసార్లు చెప్పాలి? దాని సంగతి నీకు తెలీదులే. ఇంక ఎప్పుడూ మాట్లాడవు కదూ! ప్లీజ్ నా మాట విను. ఇది మన మంచి కోసమే. వచ్చేఆదివారమే మీయింటికొస్తున్నా.

నీ తియ్యని సాన్నిహిత్యంకోసం ఉవ్విళ్ళూరే -

ఎల్లప్పటికీ నీ సరూ.

ఎడ్రస్ వ్రాసి అతికించకుండా టేబుల్‌పై పడేసి, స్నానానికి వెళ్ళింది.

అక్క ఏం చేస్తున్నదో అని సరోజ రూమ్‌కెళ్ళిన సరితకి ఈ లెటర్ కనపడింది. ఇంకేం ఉపద్రవాలొస్తాయో అని భయపడి నాన్నకు చేరవేసింది లెటర్‌ని. అంతే అది చదివి మహోగ్రుడయ్యాడు. అప్పుడే స్నానంచేసి వచ్చిన సరోజను. "ఏమే నీ వింతపని చేస్తావని నేనెప్పుడూ అనుకోలేదే" అన్నారు. ఎప్పుడూ ఏమే అని సంబోధించని నాన్న ముఖం చూసేటప్పటికి సరోజ తెల్లబోయింది "ఏంటి? నేనేం చేశాను" అని గారాంగ అంది. వెంటనే చెంప చెళ్ళుమంది. ఎన్నడూలేని ఈ దెబ్బకు సరోజకు కాళ్ళ క్రింద భూమి కదలిపోతున్నట్లనిపించింది. అయినా మొండి

ధైర్యంతో "నేనేం చేశానని నాపై చెయ్యి చేసుకొన్నావు" అని అరచింది. "ఇంకేం చెయ్యాలే. నిన్ను చదివించినందుకు నా పరువు గంగపాలు చేశావే". నాన్న చేతిలో లెటరు చూసేటప్పటికిగాని లైటు వెలగలేదు సరోజకు. వెంటనే చిరునవ్వుతో "అడ్రసు చూడండి నాన్నగారూ!" అన్నది ఆయన అడ్రసు చూడడానికి వెనుకకు తిప్పారు. "ఇన్‌లాండ్ లెటరును సి. హెచ్. పద్మిని, డాటర్ ఆఫ్ ..." ఈసారి తెల్లబోవడం ఆయనవంతయింది.

అంకితం నా ప్రియమైన దైవం
"సాయి"కి



# నా కథ నువ్వు కానీ!

మాది చిన్న పల్లెటూరు. అందరూ ఏటా వుత్సాహంగా గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు మా ఊళ్ళో జరుపుకుంటారు. నవరాత్రులలో పందిట్లో నాటకాలు, బుర్రకథలు, పురాణ కాలక్షేపాలు జరుగుతుంటాయి. ఈ సంవత్సరం దేవీ నవరాత్రులకి ఆ రోజున "ప్రతిభా నాట్య మండలి" వారి "వీర బొబ్బిలి" నాటకం నటకులంతా ప్రొద్దుట పది గంటలకే చేరుకున్నారు. ఉన్నట్లుండి సాయంకాలం ఆరు గంటలకి పాపారాయుడు వేషం ధరించే నటుడికి నూటనాలుగు డిగ్రీల జ్వరమొచ్చింది. నాట్య మండలి వారికి కంగారు పుట్టింది. ఈ గండం గడిచేదెట్లాగ? ఊళ్ళో వాళ్ళంతా నాటకం ఆగిపోతుందేమోనని భయపడుతున్నారు. పొరుగూళ్ళనుంచి కూడా జనం తండోప తండాలుగా వచ్చారు. వాళ్ళతో బాటుగా పోలయ్య కూడా వచ్చాడు. అతడప్పుడప్పుడు వీధి నాటకాల్లో చిన్నచిన్న వేషాలేస్తుంటాడు. ఊళ్ళోవాళ్ళకిగాని నాట్యమండలి వారికిగాని దిక్కుతోచటం లేదు మెల్లిగా పదిమంది పెద్దలు పోలయ్య చుట్టూ చేరి పాపారాయుడు వేషం వెయ్యటానికొప్పించారు.

రాత్రి తొమ్మిదిన్నర దాటింది. జనమంతా పందిట్లో చేరేరు. నాటకం మొదలైంది. సాగుతోంది. సందర్భానుసారంగా యుద్ధంలో రంగారావు, వెంగళరావు మరణించిన అనంతరం తాండ్ర పాపారాయుడు (పోలయ్య) స్టేజిమీది కొచ్చాడు. రాచరికపు దుస్తులు, బుగ్గమీసాలు, చింతనిప్పుల్లాంటి కళ్ళతో కత్తి తిప్పుకుంటూ "పులి, బొబ్బిలి పులి. నేనే తాండ్ర పాపారాయుడ్ని! ఏడీ విజయరామరాజు? ఆ పిరికిపంద ఎక్కడ? శత్రువులతో చేతులు కలిపి, వీర బొబ్బిలిని నాశనం చేస్తావా? నేటితో నీ ఆయువు మూడింది. నీ గుండె చీల్చేస్తా! రక్తం తాగేస్తా. నిన్ను నరికి పోగులెడతా. ఇదిగో! యీ కత్తి నీ గుండెల్లో దిగుపోతుంది. రా! రా! విజయరామరాజా! రా!" అని అరిచాడు.

ఆతర్వాత ఏం చెప్పాలో.ఏం చెయ్యాలో పోలయ్యకి తోచలేదు. కర్టెను దగ్గర కెళ్ళి నిలబడ్డాడు. ప్రాంప్టరు మాట అతనికి వినపడలేదు "ఆ తర్వాత ఏమంటాడు?" అని పైకే అనేశాడు పోలయ్య. ఆ మాట అందరికీ వినపడింది.

ఆ వూరి పెద్దకాపు ముందు వరసలోనే వున్నాడు. "అదే మంటే నీకెందుగ్గాని. నీ కత నువ్వ కానియ్యేసే" అన్నాడు.

అందరూ ఘొల్లుమని నవ్వేశారు.

—డి. వి. శ్రీరామమూర్తి


# ఋణము లభించును

తనఖాలు, తాకట్టులు, గ్యారంటర్లు అవసరము లేకుండగను మరియు తనఖాలు, తాకట్టులు, గ్యారంటర్లతోను వివిధ శ్రేణులలో ఋణములు 10 సంవత్సరములలో తీర్చేటట్లు లభించును. వివరముల కొరకు స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరుతో ఈ క్రింది అడ్రసునకు ఇంగ్లీషులో వ్రాయండి.

**BOX NO. 114,**
**℅ ANDHRAJYOTI WEEKLY,**
**VIJAYAWADA-520 010 (A. P)**



## వెలువడినవి!

డీలక్స్ వారి నూతన ప్రచురణలు

ఆర్. సంధ్యాదేవి
వెన్నెల తీరాలు డైరెక్ట్ నవల ______ రూ: 17.00
కొమ్మూరి వేణుగోపాలరావు
డాక్టరుగారి భార్య డైరెక్ట్ నవల ______ „ 20.00
జాలి లేని జాబిలి ______ „ 12.50
శాంతి ______ „ 14.00
బి. ప్రసన్నలక్ష్మి
బ్రహ్మముడి డైరెక్ట్ నవల ______ „ 20.00
జి. బి. రామం
బంగారువదిన ______ „ 12.00
పాటిబండ్ల విజయలక్ష్మి
తెలిసి చేసిన పాపం ______ „ 10.00
భావరాగాల సంస్కృతి ______ „ 8.00
ధూళిపాళ శ్రీరామమూర్తి
భగవద్గీత - బైబుల్ - ఖురాన్ ______ „ 20.00

మీరు చదివారా!

కాశీమజిలీ కథలు 12 భాగాలు ఒక్కొక్క భాగం ______ „ 20.00

డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2

PRAGATHI